# సాక్షి కర్నూలు

శనివారం : 28 : జనవరి : 2023




## అహోబిలేశుడికి పూజలు

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ జ్వాలానరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వామి నర్సాపురం చేరుకోగా భక్తులు దర్శించుకుని పూజలు చేపట్టారు.



## హుండీల్లో కానుకల లెక్కింపు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలోని హుండీల్లో కానుకల లెక్కింపు శుక్రవారం ప్రారంభమైంది. మొదటిరోజు కరెన్సీ నోట్ల ద్వారా రూ.3,14,98,676 వచ్చింది.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,617.62 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :54.912 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :000 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :8,419 |

## న్యూస్‌రీల్

### 29, 30 తేదీల్లో ఏకసభ్య కమిషన్ పర్యటన

కర్నూలు(సెంట్రల్): బెంట ఒరియా, బోయ, వాల్మీకుల సమస్యలపై అధ్యయనం కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యూల్ ఆనంద కుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ జిల్లాలో రెండు రోజుల పర్యటించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీన వెల్దుర్తి మండలం పిక్కిలివానిపల్లి, సిద్ధనగుట్ట గ్రామాల్లో పర్యటించి ఆయా కులాల ఆర్థిక స్థితిగతులను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వయంగా తెలుసుకుంటారన్నారు. అలాగే 30వ తేదీన కర్నూలులోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోయ, వాల్మీకులకు చెందిన సమస్యలపై సంబంధిత వర్గాల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు.

### రబీలో 82,061 హెక్టార్లలో పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సాధారణ సాగు 1,28,743 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 82,061 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. శనగ సాధారణ సాగు 80,572 హెక్టార్లు ఉండగా 42,917 హెక్టార్లలో సాగైంది. వరి 2,764 హెక్టార్లు, జొన్న 5,139, మొక్కజొన్న 7,973, వేరుశనగ 14,839, పొగాకు 1,100, మిరప 997, ఉల్లి 1,581 హెక్టార్ల ప్రకారం సాగైంది.

### నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



వీసీకి హాజరైన కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి తదితరులు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 22వ తేదీ ఉగాది నాటికి రాష్ట్రంలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీలకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. రీసర్వే పూర్తయిన రైతులకు భూ హక్కు పత్రాల నెలాఖరులోపు పంపిణీ చేయాలన్నారు. రహదారుల నిర్మాణాలకు భూసమస్యలు లేకుండా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ముఖహాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

### బ్యాంకుల సమ్మె విరమణ

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన బ్యాంకుల సమ్మెను తాత్కాలికంగా విరమించుకున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ జిల్లా కన్వీనర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబైలో బ్యాంకు యూనియన్లతో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, రిజర్వ్ బ్యాంకు అధికారులు నిర్వహించిన చర్చలు ఫలించాయని పేర్కొన్నారు. అన్ని డిమాండ్లను నెల రోజుల్లో పరిష్కరించేందుకు హామీ లభించినందున సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నుంచి సమాచారం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.



# పదినెక్కిన ప్రణాళిక!

**ఈ ఏడాది ప్రణాళిక** | విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజన



- గ్రూప్-ఏ : స్లిప్ టెస్టుల్లో 60శాతం మార్కులు
- గ్రూప్-బీ : 40-60శాతం మార్కులు
- గ్రూప్-సీ : 25-40శాతం మార్కులు
- గ్రూప్-డీ : 25శాతంలోపు మార్కులు

మొత్తం విద్యార్థులు : **22,791**
మొత్తం ఉపాధ్యాయులు : **4,495**
(ఒక్కో టీచర్‌కు ఐదుగురు విద్యార్థుల బాధ్యత)

**విద్యార్థుల భవితకు పాఠశాల** విద్యే పునాది. కోవిడ్ పరిస్థితులు, గతేడాది 'పది' ఫలితాల నేపథ్యంలో 'పాఠశాల విద్య' పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డ్రాపౌట్స్ మొదలు పదో తరగతి వరకు ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు, పాఠశాలల్లో లోటుపాట్లను సరిదిద్దుతూ.. ఒక్కో ఉపాధ్యాయుడికి ఐదుగురు పదో తరగతి విద్యార్థుల బాధ్యత కేటాయించింది. ఆరునూరైనా విద్యార్థుల జీవితాలను 'పది'లం చేయాలనే ప్రభుత్వ లక్ష్యమే తన సంకల్పంగా జిల్లా కలెక్టర్ అడుగులు వేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

**విద్యార్థుల భవిష్యత్‌పై సర్కారు ప్రత్యేక దృష్టి**

- గతేడాది పది ఫలితాల నేపథ్యంలో ఈ ఏడాది దిద్దుబాటు చర్యలు
- వందశాతం ఫలితాల సాధనకు పక్కా ప్లానింగ్
- ఆదోని డివిజన్‌కు ప్రత్యేకాధికారిగా ఎస్‌ఎస్‌ఏ పీఓ వేణుగోపాల్
- ఒక్కో టీచర్‌కు ఐదుగురు విద్యార్థుల బాధ్యత

కోవిడ్ నేపథ్యంలో దాదాపు రెండేళ్ల బోధనలో విద్యార్థులకు ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ కారణంగా గతేడాది 'పది' ఫలితాల్లో ఉత్తీర్ణత 58.20శాతానికే పరిమితమైంది. ఫెయిలైన విద్యార్థులు పై చదువులకు వెళ్లకుండా కూలీ పనులు, ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారని తెలిసి కలెక్టర్ కోటేశ్వరావు ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించేందుకు సంకల్పించారు. ఈ నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించగా.. గత ఏడాది ఫలితాల్లో తెలుగు మీడియం చదివే విద్యార్థులు 29.24శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లిష్ మీడియం 71.94, కన్నడ మీడియం 76.98, ఉర్దూ మీడియం 63.87శాతం పాసయ్యారు. తెలుగు మీడియం పాఠశాలల్లో అత్యధికం ప్రభుత్వ పాఠశాలలే ఉన్నట్లు వెల్లడైంది.

**పాస్, ఫెయిల్ గణాంకాలు కావు.. విద్యార్థుల జీవితాలు**

పది ఫెయిల్ అయితే విద్యార్థులు కూలీ పనులకు వెళ్తారు. గుమస్తాలుగా, మెకానిక్‌లుగా.. లేక ఇతర పనులను ఎంచుకుంటారు. పై చదువులకు వెళ్లడం ఆగిపోతోంది. అమ్మాయిలైతే, ముఖ్యంగా పల్లెల్లో ఏడాది ఇంటిపాటున ఉంటే ఆపై కచ్చితంగా వివాహం చేస్తారు. 20 ఏళ్లకే చేతిలో ఇద్దరు పిల్లలు ఉండే పరిస్థితి. ప్రమాదవశాత్తూ కొందరి భర్తలు చనిపోతే చిన్న వయస్సులోనే బతుకు భారమవుతోంది. ఈ ఉదాహరణలన్నీ కలెక్టర్ అధ్యయనంలో వెల్లడయ్యాయి. దీంతో 'ఫెయిల్, పాస్, ఉత్తీర్ణత శాతం అనేవి కేవలం నెంబర్లు కాదని.. వేలాది విద్యార్థుల జీవితాల'ని కలెక్టర్ గ్రహించారు. ఆ మేరకు పిల్లల భవిష్యత్తు 'పది'లంగా ఉండాలని, ఆ గట్టు దాటిస్తే ఇంటర్మీడియట్ చదువుతారు, వయస్సు పెరగడంతో ఆలోచన శక్తి పెరుగుతుందని.. వారే తమ జీవితాలను దారిలో పెట్టుకుంటారని భావించారు. దీంతోనే ఈ ఏడాది వందశాతం ఫలితాలు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ఆదోని డివిజన్‌కు ప్రత్యేక అధికారిగా సర్వశిక్ష అభియాన్ పీఓ వేణుగోపాల్‌ను నియమించారు.

**కొన్ని చోట్ల భళా.. మరిన్ని చోట్ల డీలా**

గతేడాది భిన్న ఫలితాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఈ విద్యా సంవత్సరం విద్యార్థులను ఏ, బీ, సి, డి గ్రూపులుగా విభజించారు. ఈ మేరకు ఒక్కో టీచర్ ఐదుగురు విద్యార్థుల బాధ్యత తీసుకుని వారు ఏ సబ్జెక్టులు వీక్‌గా ఉన్నారు, చదువుపై దృష్టి పెడుతున్నారా? లేదా? అనే విషయాలతో కౌన్సెలింగ్ ఇస్తూ పర్యవేక్షిస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందనే నిర్ణయానికి వచ్చారు. ఆ మేరకు ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా వర్క్‌షాపు నిర్వహించి విద్యార్థుల జీవితాలు ఉపాధ్యాయుల చేతిలో ఉన్నాయని, సున్నా ఫలితాలు వచ్చాయంటే అందుకు కారణాలేంటో విశ్లేషించుకోవాలని కలెక్టర్ సూచించారు.

**గత ఏడాది 'పది' ఫలితాలు**

| | |
|---|---|
| మొత్తం విద్యార్థులు | : 51,669 |
| ఉత్తీర్ణులైన విద్యార్థులు | : 30,069 |
| ఉత్తీర్ణత శాతం | : 58.20 |
| వంద శాతం ఉత్తీర్ణత పాఠశాలలు | : 7 |
| సున్నా ఉత్తీర్ణత పాఠశాలలు | : 7 |

**71 సీజనల్ హాస్టళ్లలో 12,677 మంది విద్యార్థులు**

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలని, బడి బయట ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో జిల్లాలో 71 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో 12,677 మంది విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్న భోజనం వీరికి పాఠశాలలోనే అందిస్తున్నారు. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనానికి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి నెలకు రూ.వెయ్యి ఖర్చు చేస్తోంది. వీరి పర్యవేక్షణకు బీఎడ్ చదివిన ఓ టీచర్‌తో పాటు మరో విద్యా వలంటీర్, ఒక సహాయకుడిని నియమించారు.

**చదువుతోనే పేదరికం దూరం**



గతేడాది ఫలితాల నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థులు ఏం చేస్తున్నారని సర్వే చేస్తే బాధాకర విషయాలు తెలిశాయి. పిల్లలు కూలికి వెళ్లడం, చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం లాంటి ఘటనలు జరిగాయి. ఇంట్లో ఒకరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తే, ఆ తర్వాత జనరేషన్ అంతా మంచి చదువులతో బాగుపడుతుంది. చదువుతోనే పేదరికం దూరమవుతుంది. అందుకే పదోతరగతి కచ్చితంగా పాస్ కావాలి. ఆ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– పి.కోటేశ్వరరావు, కర్నూలు జిల్లా కలెక్టర్



## మహాగౌరికి స్వర్ణ కవచం

కర్నూలు కల్చరల్: నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహా గౌరి అమ్మవారికి శుక్రవారం స్వర్ణ కవచాన్ని బహూకరించారు. భక్తులు ఇచ్చిన రూ.8 లక్షల విరాళాలతో దీనిని తయారు చేయించారు. ఆలయ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాజశ్యామల పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ కవచాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

## యాత్రను ఆపించుకునేందుకే అసత్య ప్రచారం

- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ రామయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): యువగళం యాత్రను ఎలాగైనా ఆపించుకొని ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే జీవోపై టీడీపీ నేత లోకేష్ అసత్య ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన తరహాలోనే ఈ జీవో ఇచ్చారని వెల్లడించారు. కందుకూరులో నిర్వహించిన చంద్రబాబు షోలో ఎనిమిది మంది మృతి చెందారని, టీడీపీ కిట్ల కోసం ఎగబడి గుంటూరులో ముగ్గురు అమాయకులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కారణంగా గతంలో గోదావరి పుష్కరాల్లో 29మంది అమాయకులు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. సామాన్యులను బలి తీసుకున్న కారణంగా ప్రజల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు లోబడి జీవో తెచ్చారని పేర్కొన్నారు. 1983లో కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు టీడీపీలో చేరి 1995లో పార్టీని, గుర్తును లాక్కొని సొంత మామ ఎన్‌టీఆర్ చావుకు కారణమయ్యారని విమర్శించారు. వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రాజధాని పేరుతో రూ.వేల కోట్లు దోచుకుని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేసిన నీచ చరిత్ర చంద్రబాబుది అన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప ప్రజా సంక్షేమం కోసం ఏదీ మాట్లాడరన్నారు. పార్టీ అధినేతను అంటూ గణతంత్ర వేడుకల్లో చెప్పులు తొడుక్కుని జెండావిష్కరణ చేశారని, రాజ్యాంగాన్ని గౌరవించలేని వ్యక్తి నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. స్పీకర్‌గా పనిచేసిన నాందెడ్ల మనోహర్‌కు కూడా గణతంత్ర విలువ తెలియకపోవడం విచారకరమన్నారు. వామపక్ష విలువలను కమ్యూనిస్టు నేత రామకృష్ణ పోగొడుతున్నారని, మంచి చేసే ప్రభుత్వాన్ని విమర్శించడం తగదన్నారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని 175 స్థానాల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, యూనుస్, కర్నాటి పుల్లారెడ్డి, ఇలియాస్, లక్ష్మీ కాంతయ్య పాల్గొన్నారు.

## 30న 'జగనన్న చేదోడు'

- ఉమ్మడి జిల్లాలో 26,392 మందికి రూ.26.39 కోట్ల లబ్ధి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30వ తేదీన జగనన్న చేదోడు పథకం కింద నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు ఆర్థిక చేయూతను అందించనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 26,392 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.26,39,20,000లను జమ చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేయనున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో 2,662 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.2,66,20,000, అలాగే 3,656 మంది రజకులకు రూ.3,65,60,000, టైలర్లు 6,538 మందికి రూ.6,53,80,000 విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

## లోకేష్‌ది బూటకపు యాత్ర

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ఆలూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు తనయుడు లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఒక బూటకమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యాత్ర వెనుక రాజకీయ దురుద్దేశం తప్ప మరొకటి కాదన్నారు. నిజంగా ప్రజల కష్టాలను లోకేష్ తెలుసుకోవాలంటే ఈ యాత్ర అవసరం లేదన్నారు. అతని తండ్రి చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ప్రజలకు చేసిన మోసాన్ని ఒప్పుకున్నట్లు తెలుస్తోందన్నారు. రాజకీయ నిజ జీవితంలో అన్నీ వెన్నుపోట్లేనన్నారు. ఆయన పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెత్తందారులకు దోచిపెట్టడమే సరిపోయిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆకలి తీర్చడంతో పాటు వారికి నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. ప్రస్తుతం నారా లోకేష్ పాదయాత్రలో అధికారంలోకి వస్తే ఎలాంటి పాలన అందిస్తారో ప్రణాళిక లేకుండా పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పాదయాత్ర ప్రారంభంలోనే సొంత బంధువు అనారోగ్యం పాలుకావడం అరిష్టాన్ని తెలియజేస్తుందన్నారు. ఎవరు ఎన్ని పాదయాత్రలు చేసినా వైఎస్ జగన్ మళ్లీ సీఎం కాకుండా ఎవరూ అడ్డుకోలేరన్నారు.

# ఆంధ్రా రైతులే నయమప్పా



అనుబంధాలకు వారధిగా ఉన్న టీఎస్ కూళ్లూరు డిస్ట్రిబ్యూటరీ కాలువ

'మా ఊరు కర్ణాటక రాష్ట్రంలోని శిరుగుప్ప తాలూక నాగరహాల్. మా ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఇక్కడ రైతు భరోసా.. పంట నష్టపరిహారం కింద డబ్బు ఏమీ రాదు. మా పక్కనే ఆంధ్ర రైతులు ఉన్నారు. అక్కడ వాళ్ల సర్కారు నుంచి అన్నిరకాల డబ్బులు వస్తున్నాయి. వాళ్ల ప్రభుత్వ అండ బాగుందప్పా. ఆంధ్ర రైతులకు ఎలాంటి ఢోకా లేదు. ఆంధ్ర సర్కారు అండతోనే అక్కడి రైతులు వ్యవసాయం బాగా చేసుకుంటున్నారు' అంటున్నారు కర్ణాటకలోని రైతులు.

**ఏపీ ప్రభుత్వ పథకాలపై కర్ణాటక కర్షకుల ముచ్చట**

- రైతు భరోసా, పంట నష్టపరిహారం పథకాలు బాగున్నాయంటూ కితాబు
- 'సాక్షి'తో సంతోషం పంచుకున్న కన్నడ రైతులు

మంత్రాలయం/కౌతాళం: మంత్రాలయం నియోజకవర్గం సరిహద్దులో కౌతాళం మండలం కుంటనహాల్, ఉప్పరహాల్, రౌడూరు, బాపురం, మేళిగనూరు గ్రామాలను ఆనుకుని కర్ణాటక రైతుల సాగు భూమి ఉంది. ఇక్కడ అలబనూరు, నాగరహాల్, రావెహాల్, కొత్తలచింత, టీఎస్ కుళ్లూరు, హచ్చొళ్లి, మురణి, మాటూరు గ్రామాల పొలాలు ఆంధ్ర ప్రాంత పొలాలను ఆనుకుని ఉన్నాయి. దాదాపు 25 కిలోమీటర్ల పొడవున ఇరు రాష్ట్రాల రైతుల పొలాలు కలిసిపోయి ఉంటాయి. ఇక్కడ రెండు రాష్ట్రాల రైతులు కలిసి మెలసి వ్యవసాయం చేస్తారు. ఒకరి అనుభవాలను మరొకరు పంచుకుంటూ సాగుబడిలో ముందుకు సాగుతుంటారు. ఆయా గ్రామాల్లో 'సాక్షి' బృందం పర్యటించగా.. ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చారు.



కర్ణాటకలోని కుంటనహాల్ రైతులు సాగుచేసిన మిరప పైరు

**'అవరిగె సర్కార బెంబళ వళ్లెయితప్పా'**

నాగరహాల్ గ్రామానికి చెందిన చిన్న ఈరన్న, నబి రసూల్, ఉప్పరహాల్ గ్రామానికి చెందిన దొడ్డ మహదేవ మాట్లాడుతూ.. 'నమ్మ సర్కార రైతరిగే బెలే కొడ్తా ఇల్లా (మా ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు). ఇల్లీ రైతరిగే భరోసా, బెళె లాసాదరె దుడ్డు ఏనూ బరల్లా(ఇక్కడ రైతు భరోసా, పంట నష్టపరిహారం డబ్బులు ఏమీ రావు). నమ్మ పక్కదల్లే ఆంధ్ర రైతరు ఇద్దార (మా పక్కనే ఆంధ్ర రైతులు ఉన్నారు). అవరిగె అవర సర్కారిద్దా ఎల్లారొక్కాగళు బర్తావా (అక్కడ వాళ్ల సర్కారు నుంచి అన్ని రకాల డబ్బులు వస్తున్నాయి). అవరిగె సర్కార బెంబళ వళ్లెయితప్పా (వాళ్ల ప్రభుత్వ అండ బాగుందప్పా). ఆంధ్ర రైతరిగె చింత ఏనూ ఇల్లా (ఆంధ్ర రైతులకు ఎలాంటి ఢోకా లేదు). అవర సర్కార సపోర్టులిద్ద బెళె బెలుస్తార (ఆంధ్ర సర్కారు అండతో వారు వ్యవసాయం బాగా చేసుకుంటున్నారు)' అని చెప్పుకొచ్చారు. ఏపీ రైతులకు అక్కడి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతపై సంతోషం వ్యక్తం చేశారు. కర్ణాటక కంటే ఆంధ్రలోనే వ్యవసాయం చాలా బాగుందని, ప్రభుత్వం అక్కడి రైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని కర్ణాటక రైతులు చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లేకపోవడంతో కర్ణాటకలోని సన్నకారు రైతులు అవస్థలు పడుతున్నారని వివరించారు.



ఏపీ రైతులు కొనుగోలు చేసిన కర్ణాటక పొలాలు

**ఐదెకరాలు కొన్నా**



మా గ్రామాన్ని ఆనుకుని రావెహాల్ గ్రామ పొలాలు ఉన్నాయి. ఇటీవల ఓ రైతు నుంచి 5 ఎకరాలు కొన్నా. కర్ణాటక రిజిస్ట్రేషన్ కావడంతో ఆ పొలాలకు కర్ణాటక ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. మన పరిధిలో ఉన్న 7 ఎకరాలకు ఏపీ ప్రభుత్వం నుంచి రైతు భరోసాతోపాటు పంట నష్టపరిహారం కూడా తీసుకున్నా. అక్కడి రైతులు సాయం అందక చాలా బాధపడుతున్నారు. మా గ్రామానికి చెందిన రామగోవిందు 15 ఎకరాలు, బళ్లారి దస్తగిరి 5 ఎకరాల కర్ణాటక పొలాలు కొన్నారు. వాళ్లకూ సాయం అందటం లేదు.

– దొడ్డ మహదేవ, ఉప్పరహాల్, కౌతాళం

**నమ్మ సర్కార ఏనూ కొడ్తా ఇల్లా**



టీఎస్ డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద నాకు రెండెకరాల పొలం ఉంది. కుంటనహాల్ రైతుల పొలాల మీదుగానే మా పొలాలకు నీళ్లు తీసుకుపోతున్నాం. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పంటలు పండించుకుంటున్నాం. నమ్మ సర్కార ఏనూ కొడ్తా ఇల్లా (మా రాష్ట్రం నుంచి రైతులకు ఎలాంటి సాయం అందడం లేదు.) ఆంధ్రలోని ప్రభుత్వం రైతులకు అండగా ఉంది. పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడి నిధి ఇస్తోంది. పంటలు నష్టపోయినా పరిహారం సైతం అందజేస్తున్నారు. మా ప్రభుత్వం కంటే ఆంధ్ర ప్రభుత్వం నయమనిపిస్తోంది.

– నబి రసూల్, రైతు, నాగరహాల్, కర్ణాటక

## క్లుప్తంగా

### కుమారుడి నిశ్చితార్థం రోజే తండ్రి మృతి

● సూగూరు గ్రామంలో విషాదం



ధర్మన్న (ఫైల్)

మంత్రాలయం రూరల్: కుమారుడి నిశ్చితార్థం రోజే తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ దుర్ఘటన సూగూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ధర్మన్నకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరి కుమార్తెలకు గతంలోనే వివాహం చేశారు. మూడో సంతానం అయిన మల్లేష్‌కు నందవరం మండలంలోని ఓ గ్రామంలోని యువతి పెళ్లి కుదిరింది. పెద్దలందరూ కలిసి నిశితార్థం వేడుకకు గురువారం రాత్రి అమ్మాయి గ్రామానికి వెళ్లారు. ధర్మన్న ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో తన భార్యతో కలిసి వెళ్లలేకపోయాడు. నిశ్చితార్థం ముగిసిన అనంతరం ఫొటోలు దిగుతుండగా ధర్మన్న గుండెపోటుతో మృతి చెందాడన్న వార్త అందిరిలోను విషాదం నింపింది. నిశ్చితార్థ కార్యక్రమాన్ని ముగించుకుని బంధువులందరూ సూగూరు గ్రామానికి వెళ్లారు.

### మహిళ బలవన్మరణం

**కోవెలకుంట్ల:** మండల కేంద్రం సంజామలలో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. శుక్రవారం ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గాజుల రాజుంబీ(43)ని గడివేములకు చెందిన మహబూబ్ బాషాకు ఇచ్చి 23 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. భర్త మృత్యువాత పడటంతో 20 ఏళ్లుగా స్వగ్రామంలోనే తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. మరో వివాహం చేసుకోవాలని తల్లితండ్రులు ఒత్తిడి చేయడంతో ఆమె జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తండ్రి అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అదుపు తప్పిన స్కూటర్.. ముగ్గురికి గాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం

**కోసిగి:** మండల కేంద్రమైన కోసిగి శివారులో ఎదురుగా వస్తున్న కంకర టిప్పర్‌ను తప్పించబోయే క్రమంలో స్కూటర్ అదుపుతప్పి కింద పడి ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదోని పట్టణం హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న ఎరుకుల ఈరన్న, భార్య లక్ష్మి, కుమారుడు మహేష్‌లు కలిసి స్కూటర్ పై కోసిగిలో రేణుక ఎల్లమ్మ దర్శనార్థం వచ్చారు. అక్కడ దేవరలో పాల్గొని తిరిగి స్కూటర్‌పై ఆదోనికి వెళ్తుండగా కోసిగి తహసీల్దార్ కార్యాలయం దాటిన తర్వాత మలుపు వద్ద ఎదురుగా కంకర టిప్పర్ వచ్చింది. దానిని తప్పించబోయి మోటారు సైకిల్ అదుపుతప్పడంతో ఈరన్న, లక్ష్మి, మహేష్ కిందపడి గాయపడ్డారు. క్షతగాత్రులకు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# జాలవాడిలో ఘాతుకం

కంటికి రెప్పలా చూసుకునే భార్య.. ఆర్థికంగా సహకారం అందించే అత్త.. చెప్పిన మాట వినే పిల్లలు.. చక్కగా సాగుతున్న కుటుంబాన్ని చక్క దిద్దాల్సిన అతను గాడి తప్పాడు. మద్యానికి బానిసై బాధ్యత మరిచాడు. కన్నబిడ్డలు కాళ్లావేళ్లా పడినా కరుణించలేదు. విచక్షణ మరచి భార్యను, అత్తను అతి దారుణంగా నరికి చంపాడు. ఈ ఘాతుకం శుక్రవారం తెల్లవారు జామున పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామంలో చోటుచేసుకుంది.

**భార్య, అత్తను నరికి చంపిన కిరాతకుడు**

- కన్న బిడ్డల కళ్లెదుటే కడతేర్చిన కర్కోటకుడు
- రాత్రంతా భయంతో వణికిపోయిన చిన్నారులు



నాగరాజు



హత్యకు గురైన శాంతి



భీమక్క(ఫైల్)



చిన్నారులను విచారిస్తున్న డీఎస్పీ కేఎస్ వినోద్‌కుమార్

పెద్దకడబూరు/మంత్రాలయం: ఎలక్ట్రీషియన్ పని చేసి జీవనం సాగించే కేసీ నాగరాజు(36)తో 12 ఏళ్ల క్రితం ఆదోనికి చెందినఅతని మేనత్త పూజారి లక్ష్మమ్మ (అలియాస్ భీమక్క), పూజారి కురువ ముక్కన్న ఏకైక కుమార్తె శాంతి (28)కి వివాహమైంది. వీరికి చైతు ప్రసన్న (11), విష్ణువర్ధన్ (9), మణికంఠ (7) సంతానం. వీరి కాపురం 8 ఏళ్లపాటు సాఫీగానే జరిగింది. ఐదేళ్ల నుంచి నాగరాజు నిత్యం భార్య శాంతిని వేధిస్తూ వస్తున్నాడు. తాగుడుకు బానిసై డబ్బు కోసం భార్యతో గొడవపడేవాడు. ఏకైక కూతురు కావడంతో భీమక్క తరచూ ఆర్థికసాయం చేస్తూ వచ్చింది. నాగరాజు స్కూటర్ కొనుక్కునేందుకు ఇటీవల రూ.50 వేలు ఇచ్చింది. అయినా నాగరాజు ప్రవర్తనలో మార్పు రాలేదు. వేధింపులు ఎక్కువ కావడంతో నెల క్రితం భార్య శాంతి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. తాగిన మైకంలో నాగరాజు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోబోయాడు. దీంతో 20 రోజుల క్రితం తిరిగి ఆమె పిల్లలతో జాలవాడి గ్రామానికి చేరుకుంది. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఈమె వంట ఏజెన్సీ నిర్వహిస్తోంది.

**సైకోలా మారి..**

శాంతి కూతురు చైతు ప్రసన్నకు తట్టు సోకడంతో పుట్టింటి నుంచి భీమక్క సంప్రదాయంలో భాగంగా గురువారం పిండివంటతో సద్ది తీసుకుని వచ్చింది. పూటుగా మద్యం తాగి నాగరాజు రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటల దాకా బాగానే ఉండి శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో భార్యతో గొడవపడ్డాడు. భార్యను ఈడ్చి తలను బెంచుకు బాదగా శబ్దానికి భీమక్క(60), పిల్లలు నిద్ర లేచారు. తాను వెళ్లిపోతాననంటూ డబ్బు ఇవ్వాలని నాగరాజు అత్త, భార్యతో తీవ్రంగా గొడవ పడ్డాడు. అల్లుడి ప్రవర్తనతో విసుగెత్తి అత్త భీమక్క ఉన్న బంగారం చేతిలో పెట్టింది. ఇంటికి తాళం వేసి నాగరాజు బయటకు వెళ్లగా పిల్లలు ఏడుపులు మొదలు పెట్టారు. దీంతో ఆగ్రహంతో ఇంటిలోకి వచ్చి నాగరాజు సైకోలా మారాడు. కుట్టుమిషన్ కింద ఉన్న వేటకొడవలితో అత్త గొంతుపై విచక్షణా రహితంగా నరికాడు. భార్య అడ్డురాగా ఆమెను గొంతుకపై కత్తితో దాడి చేశాడు.



అనాథలుగా మారిన చిన్నారులు

**కాళ్లావేళ్లా పడినా...**

నాగరాజు, శాంతికి ముగ్గురు పిల్లలు చైతు ప్రసన్న , విష్ణువర్ధన్ , మణికంఠ, భీమక్క కొడుకు పిల్లలు శివకేశవ్, మురళీ, గగనప్రియ ఇంట్లోనే ఉన్నారు. వారి ఎదుటే నాగరాజు ఘాతుకానికి ఒడిగట్టాడు. నాగరాజు పెద్ద కూతురు చైతు ప్రసన్న తండ్రి కాళ్లు పట్టుకున్నా కనికరం చూపలేదు. కత్తితో భయపెట్టగా చైతు ప్రసన్న ప్రాణ భయంతో వంటింట్లోకి పరుగు పెట్టింది. మిగతా చిన్నారులు ఏడుపులతో వేడుకున్నా అందరినీ భయపెట్టి వారి ఎదుటే నరికేసి ఇంటికి గడియపెట్టి పరారయ్యాడు. శాంతి, భీమక్క మృతదేహాల మధ్యనే రాత్రంగా చిన్నారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. శుక్రవారం ఉదయం తాళం పగులగొట్టి కాపాడంటూ ఆర్తనాదాలతో విలపించారు. పక్కింటి ఆమె వచ్చి గడియ తీయగా చిన్నారులు బయటకు వచ్చారు. ఇంట్లో విగతజీవులుగా పడిఉన్న వారి చూసి కుటుంబ సభ్యులకు ఆమె సమచారాన్ని చేరవేసింది.

**డీఎస్పీ విచారణ**

ఆదోని డీఎస్పీ కెఎస్ వినోద్‌కుమార్ నేతృత్వంలో సీఐ ఎరిషావలి, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. ప్రత్యక్షసాక్షి చైతు ప్రసన్న, మృతురాలి అన్న మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

**అనాథలుగా చిన్నారులు..**

స్థానిక పాఠశాలలో చైతు ప్రసన్న ఐదో తరగతి, విష్ణువర్ధన్ నాలుగో తరగతి, మణికంఠ రెండో తరగతి చదువుతున్నారు. తల్లి, అవ్వ హతమవడంతో వీరు అనాథలుగా మారారు. మృతదేహాల వద్ద చిన్నారులు విలపిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. భీమక్కకు ఆదోనిలో, శాంతికి జాలవాడిలో అంత్యక్రియలు జరిపారు.

### నేడు రథసప్తమి వేడుకలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం కర్నూలులోని ఇండస్ పాఠశాలలో రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ పరిషత్ జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కారాలు చేయిస్తామని, యోగాసనాలు వేయిస్తామని, ఆదిత్య హృదయం పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సురేందర్

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ అన్నారు. కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో శుక్రవారం అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ సుదర్శన్, రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు మహబూబ్ సుభాని, రామాంజనేయులు, బాషా, శేషయ్య, వెంకటలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

## అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌యూ వీసీ ఆనందరావు

కర్నూలు (టౌన్): రాయలసీమ యూనివర్సిటీ మైదానంలో శుక్రవారం కర్నూలు జోన్ స్థాయి అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆనందరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాయలసీమ యూనివర్సిటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇటీవల మహిళా బ్యాడ్మింటన్ ఆల్ ఇండియా విశ్వవిద్యాలయాల పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టుకు మూడో స్థానం లభించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కళాశాల జట్టుపై సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కేవీ శివకిషోర్, డిగ్రీ కళాశాలల వ్యాయామ అధ్యాపకుల సంఘం నాయకులు డాక్టర్ వై.కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

## షరాఫ్ బజార్ అక్రమాలపై లోకాయుక్త సీరియస్

- టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌ను వివరణ కోరిన లోకాయుక్త
- వచ్చే నెల 6 లోపు వివరాలు తెలియజేయాలని ఆదేశం

**కర్నూలు (టౌన్):** నగరంలోని షరాఫ్ బజార్ వాణిజ్య సముదాయ అక్రమాలపై లోకాయుక్త మరోసారి సీరియస్ అయ్యింది. పత్రికలో వచ్చిన కథనాలపై షరాఫ్‌బజార్‌కు చెందిన ఒక వ్యాపారి 2021 డిసెంబర్ 8వ తేదీన లోకాయుక్తను ఆశ్రయించాడు. దీనిపై స్పందించిన లోకాయుక్త షరాఫ్ బజార్‌కు సంబంధించిన అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని అదే సంవత్సరం డిసెంబర్ 18వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో పనిచేసిన టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ రాముడు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ విజయ్ కుమార్‌కు 2021 డిసెంబర్ 28వ తేదీన విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో కుడా ప్లానింగ్ ఆఫీసర్ 2022 జూన్ నెల 6వ తేదీన షరాఫ్ బజార్‌లోని అక్రమాలకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికను సమర్పించారు. ఇదే నివేదికను టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ జూన్ 24వ తేదీన లోకాయుక్తకు లిఖితపూర్వకంగా అందజేశారు. నివేదికను పరిశీలించి స్పందించిన లోకాయుక్త 2022 జూలై 6వ తేదీన అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రస్తుత టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఆగస్టు 16, అక్టోబర్ 10 తేదీలలో కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. తాజాగా నాలుగోసారి ఈనెల 23న షరాఫ్ బజార్ అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. ఈ నివేదికను వచ్చే నెల 6వ తేదీ లోపు లోకాయుక్తకు సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.

## 'నాడు-నేడు' పనుల్లో నిర్లక్ష్యాన్ని వీడండి

● ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమీక్షలో జెడ్పీ సీఈఓ, ఎస్‌ఎస్‌ఏ పీఓ, పీఆర్ ఎస్ఈ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ''గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనెటీస్ సెక్రెటరీలు పనిచేయడం లేదు. దీంతో నాడు- నేడు పనుల్లో జిల్లా రాష్ట్రంలో 16వ స్థానానికి చేరుకుంది. కోట్ల రూపాయల నిధులు ఉన్నా, ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి, లక్ష్యాన్ని చేరుకోవాలి'' అని పలువురు జిల్లా స్థాయి అధికారులు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నాడు - నేడు పనులకు సంబంధించి కర్నూలు డివిజన్‌లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనెటీస్ సెక్రెటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, ఎస్‌ఎస్‌ఏ పీఓ వేణుగోపాల్, పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ రంగారెడ్డి, నగర పాలక సంస్థ ఎస్ఈ శేషసాయి, ఈఈ షాకీర్‌హుసేన్, ఎస్ఎస్ఏ ఈఈ కర్రెన్న, ఏపీఎస్‌డబ్ల్యూఐడీసీ డీఈఈ గోన నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో వేగం పెంచేందుకు నిర్వహిస్తున్న వెబెక్స్, టెలి కాన్ఫరెన్స్‌లకు అనేక మంది గైర్హాజరు అవుతున్నారన్నారు. డివిజన్‌లో 200 మంది ఉద్యోగులు ఉంటే 76 మంది గైర్హాజరు అయ్యారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వారందరికీ ప్రొబేషన్ డిక్లేర్ అయినందున ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే సీసీఏ నిబంధనలు వర్తిస్తాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సోమవారం తమ పరిధిలోని పాఠశాలలకు వెళ్లి అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. కథలు చెప్పే పద్ధతిని మానుకోవాలన్నారు. పనులకు సంబంధించి జిల్లాలో రూ.3 కోట్లు ఉన్నాయని, వాటిని ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వెచ్చించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

### 21 గ్రామాల్లో భూముల రీ సర్వే

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రీ సర్వేపై ఎప్పటికప్పుడు వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమీక్షిస్తున్నామన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి రైతులకు ముందస్తుగా సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాల వద్ద ఉండి వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాటికి ఆరు గ్రామాల్లో 44802.54 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని స్పష్టం చేశారు.

## వచ్చే నెల 1 నుంచి ఎన్‌ఎల్‌ఎం టీమ్ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీ వరకు జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ (ఎల్‌ఎల్‌ఎం) బృందం పర్యటించనుందని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎల్‌ఎం టీమ్ ఈ నెల 31న కర్నూలుకు వస్తుందన్నారు. కర్నూలు జిల్లాలోని కృష్ణగిరి, నందవరం మండలాల్లోని ఆరు పంచాయతీలు, నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లోని 4 పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై బృంద సభ్యులు పరిశీలన చేస్తారన్నారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 10 పంచాయతీల్లో ప్రజలతో బృంద సభ్యులు ముఖాముఖి అవుతారన్నారు. నాగలదిన్నె, అల్లూరు గ్రామాల్లో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన కింద చేపట్టిన పనులను పరిశీలించనున్నారన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా అడిషినల్ పీడీ సలీమ్‌బాషా, డీఎల్‌పీవోలు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

### కవి వెంకటకృష్ణకు పురస్కారం



వెంకట కృష్ణను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ కవి జి.వెంకటకృష్ణకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ముద్రిక కార్యాలయంలో వెంకటకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం 2020 సంవత్సరానికి ప్రకటించిన ఈ పురస్కారం వెంకటకృష్ణ రచించిన 'దేవరగట్టు' కథల సంపుటి ఎన్నికైందన్నారు. ముద్రిక కళా స్రవంతి అధ్యక్షులు పి.భాస్కర్, నగర అధ్యక్షులు డి.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## పీ- మార్ట్‌లతో నాణ్యమైన మాంసం

● రాష్ట్ర మీట్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విజయుడు



డాక్టర్ విజయుడిని మర్యాదపూర్వకంగా కలసిన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ప్రజలకు నాణ్యమైన మాంసం అందించేందుకు పీ-మార్టులను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విజయుడు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో పీ.మార్ట్ మాంసం విక్రయ కేంద్రాల ఏర్పాటుపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాకు చెందిన ఈయనను పశుసంవర్ధకశాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలసి బోకేలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని జాతీయ మాంసం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు పీ మార్ట్ పరికరాన్ని రూపొందించిందన్నారు. కేవలం ఇద్దరితో రోజుకు తొమ్మిది జీవాలను వధించి నాణ్యమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మాంసం ఉత్పత్తి చేసి విక్రయించుకోవచ్చని తెలిపారు. పీమార్ట్‌ను మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలతో పాటు ప్రయివేటు వ్యక్తులు కూడా వినియోగించుకోవచ్చన్నారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య, ఏడీలు భవాని శంకర్‌రెడ్డి, మాధవి, ప్రమీల, పశువైద్యుడు చెన్న కేశవులుపాల్గొన్నారు.

### ప్రతిభా పాఠశాలలో లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాలలో లెక్చరర్ పోస్టులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ రెడ్డెప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ మాథ్స్, పీజీటీ బయోలాజికల్ సైన్స్ ఇంగ్లిషు మీడియంలో బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 30 తేదీ ఉదయం 09.30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఈ నియామకం చేపట్టనున్నామని, ఇతర వివరాలకు 9490957268ను సంప్రదించాలన్నారు.

### యువకుడి ఆత్మహత్య



మృతుడు బోయ రవి(ఫైల్)

ఆదోని అర్బన్: మండలంలోని ఇస్వి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు కింద పడి బోయ రవి(21) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన బోయ రవి ఇస్వి రైల్వేస్టేషన్ సమీపంలో చెక్కీల ఫ్యాక్టరీని నిర్వహించేవాడు. రోజూ ఆటోలో చెక్కీలను గ్రామాలకు సరఫరా చేసేవాడు. ఈ క్రమంలో ఒకరోజు ఆటో తగలి ఒక బాలుడు మృతి చెందాడని, తన కారణంగా ఒక పిల్లవాడు చనిపోయాడని మనస్తాపానికి గురై రవి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

| పంట | కనిష్ఠం(రూ) | గరిష్ఠం (రూ) |
|---|---|---|
| వేరుశెనగ | 5,875 | 8730 |
| పొద్దుతిరుగుడు | 1,000 | 5,141 |
| ఆముదం | 3614 | 6,427 |
| శనగలు | 4,340 | 4,669 |
| ఉల్లి | 821 | 1519 |
| ఎండు మిర్చి | 6,009 | 28,199 |
| కందులు | 2,400 | 6,989 |
| మొక్కజొన్న | 1,817 | 1,817 |
| మినుములు | 3,216 | 6,709 |

